

ఆ దుర్గమారణ్యం ముందు నిలబడి పోయాడు అతను– తలపాగాను తీసి జుట్టును సవరించు కుంటూ, శరీరానికతుక్కుపోయిన కవచ, భుజకీర్తుల్ని సవరించుకుంటూ.

# గాలింపు ఖర్చులు

జి. వెంకటకృష్ణ

ఆశ్చర్యంతోనూ, అనుమానంతోనూ శ్వాసను ఎగబీల్చాడు. అపూ ర్వమైన ఒక వింతైన వాసన. దానిని గుండెలనిండా పీల్చుకుంటూ, ఒక్కసారిగా చెయ్యెత్తి సైగ జేశాడు. అతన్ని అనుసరిస్తున్న పటాలం ఆగిపోయింధి. అందరూ తమ తమ వస్తు సముదాయాన్ని దించి గాలిని ఎగబీల్చారు. వాళ్ళందర్నీ తాము వెతుకుతున్న వాసనొకటి చుట్టుముట్టింది.

నాయకుడికి సంకేతం అందుతోంది, తాము సరైన దారిలో వచ్చినట్లే. పథకం సరిగా పన్నినట్లే, వ్యూహం కూడా అమలైతే వుచ్చు బిగుసుకున్నట్లయితే– గొప్ప నజరానా! ఆనందమేసింది. 'అందం చూడవయా ఆనందించవయా' అంటూ గతరాత్రి తనను కులాసపరుస్తూ నర్తకి పాడిన పాటను మనసు పాడుకుంది. అంతలోనే భయం కూడా వేసింది. గుండెలు జారుతు చిరుచెమటలు పట్టాయి. 'ఎక్క డున్నాం తాము?' అంతా సాఫీగా జరుగుతుందని హామీ ఏమీ లేదుకదా' అన్న ఆలోచన యిబ్బంది పెట్టింది.

'అయినా, ముఖా ముఖీ వాళ్ళతో ఎప్పుడు తలపడ్డా మనీ, దొంగదెబ్బలే కదా తీసింది, చాలాసార్లు' అనే సత్యం కూడా మొదలైంది.

'మహా ఎదురైతే అవతలి పక్షపు వేగులు దొరక వచ్చు, లేదా వాళ్ళకు ఆహార పానీయాలు అందించే జానపదులు అయ్యుం డచ్చు!

నాయకుడి ఆలోచనలు

గ్రహిస్తూ పటాలం సరంజామాను చేతుల్లోకి తీసుకుంది. దుర్గమారణ్యాల్లో గాలింపు, 'తల దువ్వుకోనడం లాంటిది వాళ్ళకు. ఒక్క వెంట్రుక తమది రాలకుండా చాలా నాజూగ్గా చేస్తుంటారా పనిని. అడవుల్లో దువ్వినా, మైదానాల్లో దువ్వినా పేన్లనూ, చీమలను నలిపినట్లు తమ శత్రు ప్రాణాల్ని నిర్దాక్షిణ్యంగా హరిస్తుంటారు. బొట్టు రక్తం చిందకుండా కీర్తి కిరీటాల్నీ, నజరానాల్నీ, పతకాల్నీ సాధిస్తుంటారు. ఇట్లాంటి దుర్గమారణ్యాల్లోకీ వాటి పరిసరాల్లోకీ మృగాలై, సరీసృపాలై పరకాయ ప్రవేశం చేసి గాలిస్తుంటారు. కాటేస్తుంటారు. వీళ్ళ పరకాయ ప్రవేశం వల్లనే జానపదులు నిజమైన పామేదో, పటాలం పామేదో తెలుసుకోలేక పోతుంటారు.

దుర్గమారణ్యం ముందు వాసన పీలుస్తూ నిలబడిపోయిన నాయకుడు, తన పటాలంలోని నలుగురిని పాములుగా, మరో నలుగురిని డేగలుగా మార్చి ఆచూకీ తీసుకురమ్మని పురమాయించాడు.

* * *

మధ్యాహ్నపు ఎండ పచ్చటి తీగలు పాకిన మహావృక్షాలపై పరుచుకుని, కింద నేలను పచ్చని చీకటిని కమ్మినట్లు మెరిపిస్తోంది. వింత శోభనిస్తున్న ఆ పచ్చటి మెరుపులో అటవీ ప్రాంతం ఒక మహా నిశ్శబ్దంలో వొదిగి పడుకున్న వింతమృగంలా వుంది. తెరలు తెరలుగా పరుచుకున్న భయంకర ప్రశాంతతకు నేపథ్యంలా కీచురాళ్ళ చప్పుడూ, యింకా అప్పుడప్పుడు పక్షుల కలకలమూ, మృగాల అరుపులూ, ఒక్కోసారి దగ్గరగానూ, మరొకసారి దూరంగానూ వినిపిస్తున్నాయి.

ఇవేవీ తమ దీక్షను భంగపరచవని చెప్పడానికన్నట్లు ఇద్దరు పశువుల కాపరులు ఒక చెట్టు నీడలో సేదదీరుతున్నారు. ఒక యువకుడు పిల్లనగ్రోవి వూదుతూంటే, మరొకతను అది వింటూ పడుకున్నాడు. వారికి దూరంగా వారు మేతకై తీసుకొచ్చిన పశువులు కొన్ని గడ్డిమేస్తూ, మరికొన్ని నెమరు వేస్తూ వున్నాయి.

ఈ ప్రశాంతతను భంగపరుస్తూ దూరంగా పక్షుల కలకలం వినిపించింది. కాసేపటికి ఆ కలకలం దగ్గరయ్యింది. పశువులు అటూ యిటూ పరుగెత్తసాగాయి. ఇదంతా పశువుల కాపరి గమనించి పిల్లనగ్రోవి వూదడం ఆపేసే సరికి, అతని ఎదురుగా ఆయుధధారులైన డేగలు నిలబడి వున్నాయి. పడుకున్నవాడు కళ్ళు తెరిచి చూసి అరవబోయేంతలో, వచ్చిన వాళ్ళు అతని నోరుమూసి యిద్దరినీ బంధితుల్ని చేసి తీసుకెళ్ళారు.

కొద్ది సమయం గడిచాక, ఎదురు చూస్తున్న పటాలం నాయకుడి ముందు వాలి ఆ యిద్దరినీ అప్పగించారు. గింజుకుంటూన్న ఆ అమాయకుల్ని చూస్తూ, తమ గాలింపులో యిద్దరు తిరుగుబాటు దారులు దొరికారనే సంబరంతోనూ, గాలింపు ఖర్చుల పేరుతో కాసులు దండుకోవచ్చనే ఆనందంతో పటాలం కదిలింది. ఈ ఇద్దరి పట్టివేత తన ఖాతాలో వేసుకోవచ్చనే ఆనందంలో దువ్విన నెత్తి మీద తలపాగాను సర్దుకుంటూ నాయకుడి పేడి మూతి మీద విషపు నవ్వు చిమ్మింది.

* * *

"సహాయకా! మన కోశాగారము నందు నిధుల స్థితిగతుల పరిస్థితి ఏమిటి?'' ముఖ్య కోశాధికారి తన సహాయకుడిని ప్రశ్నించాడు.

"స్వామీ! రోజు రోజుకూ నిధులు తరిగిపోవుచున్నవి. ఈ గణతంత్ర ప్రభువుల ఆదేశానుసారము ధనము విపరీతంగా వ్యయమగుచున్నది''

"గాలింపు ఖర్చుల పేరున పటాలాలు తీసుకొనుచున్న ధనము మాటేమిటి?''

"కోశాధిపతీ మీకు తెలియని సంగతి కాదు, రాజ్యపు యితర ఖర్చులూ, అంతఃపుర ఖర్చుల కంటే కూడా యీ గాలింపు ఖర్చులు అధికమగుచున్నవి. గణతంత్ర మండలి అనుమతి పత్రము లేకున్నా సరే గాలింపు ఖర్చులు చెల్లింపవలెనని రాజప్రముఖుడి ఆదేశానుసారము రాజ్యపు నెల వ్యయపు మొత్తములో సగభాగం దీనికే ఖర్చు అగుచున్నది. ఖజానా ఖాళీ అగుచున్నది''

"సహాయకా మనలో మాట (గొంతు తగ్గించి) యీ గాలింపులు నిజముగా జరుగుచున్నవందువా?''

"అయ్యా! బహిరంగంగా అనలేముగానీ యీ గాలింపులూ, ప్రతిఘటన దాడులతో పటాలం ముఖాముఖి పోరాటం అంతా బూటకమే గదా. ఇది బహిరంగ రహస్యమే. ఎవరినో గ్రామీణుల్ని బంధించి, అడవుల్లో ప్రతిఘటన దారుల్ని బంధించినట్లు నాటకమాడేది, అందుకై గాలింపు ఖర్చుల పేరుతో, నజరానాల పేరుతో ఖజానాను కొల్లగొట్టేదీ, రాజప్రముఖుడి కనుసన్నల్లో యిదంతా జరిగిపోతూంటే విమర్శించే వాళ్ళేరీ, గణతంత్ర ముఖ్యులు నోరు మెదపరు. దీని వెనుక ఏదో గూడుపుఠాణీ నడుస్తోందని నా అనుమానము''

"నాకునూ నీకు కలిగిన అనుమానమే కలుగుచుండును. ఖజానాకు బాధ్యుణ్ణి, ఖజానాను సంవృద్ధి చేయుటకు వనరులు అన్వేషించు మాట ఏమోగానీ, ఖజానాను ఖాళీ చేయుటకు పథకము బాగా పారుచున్నది. మన ఖజానా కరిమింగిన వెలగపండు అగుచున్నది. ప్రముఖుల సమావేశములో యీ విషయమును ప్రస్తావింపదలచినాను''

"అయ్యా అది సాహసమేమో, పటాలం దొరలకు ఆగ్రహం వస్తుందేమో జాగ్రత్తగా ప్రస్తావించండి, సమయా సమయాల్ని గమనించి మసలండి. దారినబోవు వుపద్రవము తలకు చుట్టుకొనునేమో''

"అవును నీవు చెప్పినది కూడా గమనించవలసినదే. శాంతిభద్రతల పరిరక్షణ పేరుమీద అంతులేని అధికారమును చెలాయిస్తున్న శక్తులను విమర్శించడం సాహసమే, వారి దారికి అడ్డు బోవడమంటే అగ్నితో చెలగాట మాడటమే. అయినా అంతటి అక్రమాన్ని ఎలా సహించాలి. గణతంత్ర రాజు ఖజానా నుండీ ప్రజోపయోగ కార్యక్రమాలకు ధనము సక్రమముగా ఖర్చుపెడతామని ప్రమాణము చేసి బాధ్యతలు స్వీకరించామే, మన బాధ్యతలు సక్రమముగా నిర్వహించకుంటేలా...''

* * *

"అవును నీవు చెప్పినది కూడా గమనించవలసినదే. శాంతిభద్రతల పరిరక్షణ పేరుమీద అంతులేని అధికారమును చెలాయిస్తున్న శక్తులను విమర్శించడం సాహసమే, వారి దారికి అడ్డు బోవడమంటే అగ్నితో చెలగాట మాడటమే. అయినా అంతటి అక్రమాన్ని ఎలా సహించాలి. గణతంత్ర రాజు ఖజానా నుండీ ప్రజోపయోగ కార్యక్రమాలకు ధనము సక్రమముగా ఖర్చుపెడతామని ప్రమాణము చేసి బాధ్యతలు స్వీకరించామే, మన బాధ్యతలు సక్రమముగా నిర్వహించకుంటేలా..."

గణతంత్ర మండలి సమావేశ మందిరపు ప్రధాన ద్వారము ముందు కలకలము వినిపిస్తున్నది.

సమావేశంలో పాల్గొనడానికి మందిరంలోకి ప్రవేశిస్తున్న గ్రామీణ ప్రతినిధులను తీవ్రంగా శోధిస్తున్నారు. ప్రవేశ అనుమతి పొందిన ప్రముఖులూ, రాజ ప్రముఖుడి రక్షణ దళమూ తప్ప వేరెవ్వరూ ఆయుధాలతో లోనికి ప్రవేశించరాదు. ప్రతినిధుల పేరుతో తిరుగుబాటు దారులూ, వారి సానుభూతి పరులూ రాజు పేరుతో తిరుగుబాటు దారులూ వారి సానుభూతిపరులూ రాజు సమావేశాలలో పాల్గొంటారనే అనుమానంతో యీ తనిఖీలు జరుగుతూంటాయి.

"అయ్యా భటులారా! మా గ్రామం వదిలినప్పటినుండీ, రాజధానిలో ప్రవేశం దాకా ఎన్నిసార్లు యీ తనిఖీలను ఎదుర్కోవాలి. మా వద్ద ఏముందనీ, ఈ రాజ్య పౌరులమని ఎన్ని సాక్ష్యాలు చూపాలి'' విసుగుతో ప్రశ్నించాడు ఓ పౌరప్రతినిధి.

"ఇది రాజప్రముఖుని ఆజ్ఞ. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే పటాలం దొరలకు ఏమని సమాధానం చెప్పాలి?''

భటులు తమ యిబ్బందిని వివరిస్తూ తనిఖీలు కొనసాగించారు.

అందరూ తనిఖీలు ముగించుకుని సమావేశ మందిరంలోకి ప్రవేశించారు.

ఆసనం మీద గణతంత్ర పరిషద్ ముఖ్యుడు కొలువు దీరి వున్నాడు. అతని చుట్టూ వివిధ ప్రాంతాల, వర్గాల ప్రతినిధులు ఆసీనులై వున్నారు.

రాజప్రముఖుడు ముందుగా లేచి, రాజ్యంలో రక్షణ ఏర్పాట్లూ, ప్రతిఘటన దారుల అణచివేత కార్యక్రమాల్నీ వివరించాడు. అందుకు గాను, అధిక నిధులు సమకూర్చవలసినదిగా విన్నవించుకున్నాడు.

అతని మాటలు వింటూనే సమావేశమందిరంలో గుసగుసలు బయల్దేరినాయి. అంతలో

ఖజానా ఖాళీ అవుతూంటే దాన్ని నింపే వుపాయాలు ఆలోచించండి. అంతేగానీ రాజ్యరక్షణకు అయ్యే వ్యయాన్ని యివ్వడం ఆపకండి. ఖజానా నింపడానికి కొత్త పన్నులు వేయండి. రక్షణ పన్నును అధికం చేయండి. దేవాలయాలు హుండీలతో సంపన్న వంతమవుతున్నాయి. వాటిపై పన్ను అధికం చేయండి. దండనాధికారులకు నేరస్థులపై శిక్షలు విధించునప్పుడు యితర శిక్షలు విధించడం కంటే అపరాధ రుసుములు చెల్లించడమే శిక్షగా వేయమని ఆదేశాల్వీండి

గ్రామీణ ప్రతినిధుల్లోంచి యిద్దరు వృద్ధులు లేచి సభను తేరిపారి చూస్తూ–

''ప్రభువులారా...'' అంటూ దుఃఖస్వరంతో ముందుకు రాబోతుండగా...

''ఏమిటి.. ఏమైనది..'' అంటూ రాజప్రముఖుడు గద్దించాడు.

''ప్రభూ! మాకు కలుగుతున్న దుఃఖాన్ని గురించి ఏమని చెప్పమంటారు. పిల్లల ఎడబాటుతో తల్లికి కలిగే గర్భశోకం, అది అనుభవిస్తే తప్ప అర్థమవుతుందా; అమాయకులను రాజద్రోహపు నేరము మోపి పట్టుకెళ్తున్నారు. పటాలం దొరలను ప్రశ్నించడం ప్రజలతరమా? మా వంటి ప్రతినిధులకే యీ సమావేశమందిరాలలోకి అడుగు పెట్టడానికి కష్టంగా వుంది. యిక సామాన్య ప్రజలూ, పుత్రుల్ని కోల్పోయిన తల్లిదండ్రులు మీ ముందుగానీ, యీ గణతంత్ర పరిషద్ ప్రముఖుల ముందుగానీ నిలబడి అడగగలరా. వారందరి తరపున మిమ్ములను అభ్యర్థిస్తున్నాము. గాలింపు చర్యల పేరుతో అమాయకులను వేధించడం ఆపమని పటాలం దొరలకు ఆదేశించండి. ప్రజలలో అలజడీ, అశాంతీ పెచ్చుమీరకముందే, తల్లుల గర్భశోకం ఈ గణతంత్ర రాజ్యానికి శాపమై తాకక ముందే మేల్కొనండి''

ప్రతినిధి మాటలతో నిశ్శబ్దమై పోయిన సమావేశ మందిరపు గంభీరతను భరించలేనట్లు రక్షణ బాధ్యుడైన రాజ ప్రముఖుడు సభనుద్దేశించి–

''సభా సదస్యులారా, సత్యాసత్య వివేచన తాను మాత్రమే కలిగివున్నట్లు యీ ప్రతినిధి వృద్ధులు మాట్లాడినారు. గణతంత్ర ప్రతినిధులు ఎవరికోసం రాజ్యపాలనా బాధ్యత వహించుచున్నారు? కేవలం ప్రజలకోసమే గదా. అట్టి ప్రతినిధులనూ, ప్రముఖులనూ, పాలకులనూ ఎదిరించి తామే నిజమైన గణతంత్రాన్ని స్థాపించాలని కుట్రలతో, బందిపోట్ల వలె దాడులు చేస్తూ, రహస్యముగా సంచరిస్తూ, రాజ్య స్వేచ్ఛా స్వాతంత్రాలనూ, సార్వభౌమత్వాన్నీ సవాలు చేస్తున్న తిరుగుబాటు దారులను దండించడం ప్రజావ్యతిరేకమైనదిగా చిత్రించడం ఎంతటి మూర్ఖ సాహసమో ఆలోచించండి. రాజ్య రక్షణ ప్రజారక్షణ కాదా? రాజ్య పాలకుల్ని రక్షించుకోవడం ప్రజల బాధ్యత కాదా? తిరుగుబాటుదారులకు సహాయ సహకారాలందించువారు, తిరుగుబాటు దారుల వలే రాజద్రోహులు కారా? ఆలోచించండి. గాలింపు చర్యల ఫలితంగానే రాజ్యంలో శాంతి స్థాపించబడుతున్నది. అది సత్యమని యీ సభకు తెలుసు''

''తిరుగుబాటుదారుల హింసాత్మక చర్యలు సమర్థించుట మా వుద్దేశ్యము కాదు. వారి రాజకీయ విశ్వాసాలతో మాకు నిమిత్తములేదు. తిరుగుబాటు దారుల ఆవిర్భవమెలా జరిగిందనేది యీ సభా సదస్యుల విచక్షణకే వదిలేసినా, తిరుగుబాటు దారులను పట్టి బంధించి చెరసాలల పాలు చేయడానికి అడ్డు ఎవరూ రావడం లేదుగదా! చట్టబద్ధ పాలన గురించి రాజప్రముఖుడికి గుర్తు చేయనవసరము లేదు. అయితే తిరుగుబాటుదారులకు ఆశ్రయమిచ్చిన వారినీ, తెలియక వారితో సంభాషించిన వారినీ రాజద్రోహులనడం న్యాయమా, మానవీయ దృక్పథం ఏ కాలంలోనైనా సమాజ ధర్మం కాదా, అట్టి సార్వజనీన ధర్మ బద్ధులను కూడా పట్టి బంధించి ఎట్టి విచారణ లేకుండా వధించడం సమంజసమా ఆలోచించమని యీ సభను కోరుతున్నాము'' అంటూ మరొక వృద్ధ ప్రతినిధి ప్రసంగించినాడు.

వృద్ధ ప్రతినిధుల వాదనతో సభలో గుసగుసలు బయలుదేరినవి.

ఇది గమనించిన రాజప్రముఖుడు విషయము హద్దులు మీరుతున్నదనీ, అది తమ అధికారమునకు హాని చేయుననీ గమనించి...

''గణతంత్ర పరిషద్ చేసిన చట్టపు పరిధిలో, ఆయుధములు ధరించి శాంతి భద్రతలకు భంగము కలిగించు వారెవరైనా, అట్టివారికి సహాయపడువారెవరైనా శిక్షార్హులే. ఇది రాజధర్మం– రాజ్యాన్ని పరిరక్షించుకోవడానికి శత్రుసంహారం అనివార్యం. ఈ ప్రతినిధులలో సత్యం లేదు. అమాయకులను వధించుట జరగదు. అమాయకుల ముసుగులోని నేరస్థులే శిక్షింపబడుతున్నారు. గాలింపు చర్యలలో జరుగుతున్నది యిదే''

రాజప్రముఖుడి మాటలను గణతంత ప్రతినిధులలో కొందరు గట్టిగా సమర్థించారు. కొందరు మౌనం వహించారు. వ్యతిరేకిస్తున్న వాళ్ళు పటాలం దొరలు తమమీద చేయబోయే దౌర్జన్యాన్ని వూహించి, మిన్నకుండిపోయారు. వృద్ధ ప్రతినిధులు యిద్దరూ ఏకాకులైపోయారు.

ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్న కోశాధికారిని, అతని వాలకం గమనించిన అతని మిత్రుడు దండనాధికారి సైగచేసి విరమింపచేశాడు.

ప్రతినిధుల సమావేశము ముగిసిన తర్వాత, రాజప్రముఖులు ప్రత్యేక సమావేశము జరిపినారు. దానిలోకి కోశాధికారిని పిలిపించి రాజ్యరక్షణ చర్యల నిమిత్తము, ధనాన్ని విడుదల చేయవలసినదిగా ఆదేశించినారు.

కోశాగారము ఖాళీ అవుతున్నదనీ, రాబడి కంటే ఖర్చు పెరిగినందున వారు కోరినంత ధనము విడుదల చేయుటకు సాధ్యం కాదనీ కోశాధికారి పరిస్థితి వివరించాడు.

అందుకు రాజప్రముఖుడు–

''ఖజానా ఖాళీ అవుతూంటే దాన్ని నింపే వుపాయాలు ఆలోచించండి. అంతేగానీ రాజ్యరక్షణకు అయ్యే వ్యయాన్ని యివ్వడం ఆపకండి. ఖజానా నింపడానికి కొత్త పన్నులు వేయండి. రక్షణ పన్నును అధికం చేయండి. దేవాలయాలు హుండీలతో సంపన్న వంతమవుతున్నాయి. వాటిపై పన్ను అధికం చేయండి. దండనాధికారులకు నేరస్థులపై శిక్షలు విధించునప్పుడు యితర శిక్షలు విధించడం కంటే అపరాధ రుసుములు చెల్లించడమే శిక్షగా వేయమని ఆదేశాల్వీండి''

రాజప్రముఖుడి సూచనలకు ప్రతినిధి ప్రముఖులు సంతోషముతో చప్పట్లు చరిచినారు. గణతంత్ర పరిషద్ అధ్యక్షుడు ఆ మేరకు ఆదేశాలు జారీ చేసినాడు. దీనికంతటికీ నిశ్శబ్ద సాక్షులైన కోశాధికారీ, దండనాధికారీ నిశ్చేష్టులైపోయారు.

* * *

''మన గణతంత్ర పరిషద్‌కూ బందిపోటు దొంగల ముఠాకూ బేధమేమైనా వున్నదంటావా మిత్రమా...''

''ష్... గట్టిగా అనకు. గోడలకు చెవులుంటాయి. నీ మాటలు విన్నారంటే నిన్ను తిరుగుబాటు దారులతో కుమ్మక్కు అయినావని విచారణ లేకుండా పదవీభ్రష్టుణ్ణి చేసి వధిస్తారు'' అన్నాడు దండనాధికారి.

''అంతేనా.. వేగుల ధళనాయకా'' అంటూ అడిగాడు కోశాధికారి.

ముగ్గురు మిత్రులు ఒక రహస్య మందిరంలో మధుపానము చేస్తూ ముచ్చటించుకుంటున్నారు.

''నీవు స్వభావ రీత్యా ధర్మపక్షపాతివనీ, ఆవేశపరుడవనీ వారికే తెలుసు. కానీ నీ కులము వారు యీ గణతంత్రములో అధికులూ, సంపన్నులూ అయినందువల్ల నిన్ను అంత త్వరగా శత్రువర్గంలో కలపలేకపోతున్నారు. అయితేనీ మీద వేగులను నియమిచే వున్నారు'' అన్నాడు వేగుల నాయకుడు.

''అది నీవే కాదుగదా..'' దండనాయకుడు నవ్వుతూ ప్రశ్నించాడు.

''ప్రజా పక్షపాతి, నీతిమంతుడని నా సూచన మేరకే గదా కోశాధికారిగా నియమించినది. యీ గణతంతములో అనుమానమొచ్చినచో ఎవరిమీదనైనా సరే చివరకు నామీదనైనా సరే వేగుల్ని నియమిస్తారు. మన జాగ్రత్తలో మనముండాల్సిందే'' అని.

''అదిసరే, నిన్నటి దినాన రాజప్రముఖుడిని నిలదీసిన వృద్ధగ్రామీణ ప్రతినిధుల గతి ఏమైనదో తెలియునా?'' తిరిగి ప్రశ్నించాడు వేగుల నాయకుడు.

''ఏమైనది...'' ఆతృత వ్యక్తపరుస్తూ కోశాధికారి.

''ఏమైనది.. మామూలుగా ఏమి జరుగునో అదే జరిగినది''

''వివరించుము మిత్రమా'' దండనాయకుడు.

''వారిపై అభియోగములు మోపి శిక్షించుటకు కష్టమని యెంచి, వారు తమ జనపదమును చేరులోపే నాగులను ప్రయోగించి హతమార్చినారు''

''నాగులను ప్రయోగించినారా..''

''అవును నాగులనే, నాగులతో కార్యము, చేతికి మట్టి అంటదు కదా. ప్రతినిధి సభ ప్రశ్నించినచో వారికీ, వారికీ పాత కక్షలున్నవని ఒక కట్టుకథ అల్లవచ్చును''

''ఎంతటి దుర్మార్గము''

''అంతకంటే దుర్మార్గము మరొకటి వున్నది. నాగులను బంధించమని కొందరు ప్రతినిధులు సమావేశంలో అడుగగా, రాజప్రముఖుడు ఏమన్నాడో గుర్తున్నదా, 'నాగులను పట్టి బంధించడానికి పటాలం దొరలేమైనా పాములు పట్టువారా' అని అన్నాడు గదా, అది ఎంతటి దుర్మార్గము?''

''కాగల కార్యము గంధర్వులు చేయుచుండిన ఆ మాటనక యింకేమందురు''

''పాపము వృద్ధ ప్రతినిధులు.. గణతంత్రములో ప్రశ్నించువారు సహింపబడరని తెలిసీ బలి అయిపోయినారు''

''ప్రశ్నించువారే కాదు, ప్రశ్నించువారిని సమర్థించువారు కూడా సహింపబడరు. వారు కూడా రాజద్రోహులనబడుదురు''

''దండనాయకా. న్యాయవ్యవస్థ ఏమైనా చేయలేదా దీనికి విరుగుడు''

''న్యాయమూ, అధికారమూ కలిసి నడిస్తేనే రాజ్యాభివృద్ధి అనే నినాదము ప్రచారము చేయుచున్నారు, గమనించలేదా, న్యాయదేవతైనా రాజ్యమునకు వూడిగము చేయవలననే గదా దాని అర్థము''

''ధనము ముందు న్యాయమైనా, అధికారమైనా తలవంచవలసినదే. అది ఈ రోజు ప్రత్యక్షముగా గ్రహించినాను'' అన్నాడు వేగుల దళనాయకుడు.

''ఎలా దేన్ని చూసి గ్రహించినావు'' మిగిలిన యిద్దరూ ఒకేసారి ప్రశ్నించినారు.

''మా వేగులు అందించిన సమాచారము ప్రకారము పటాలం దొరలు అందుకునే గాలింపు ఖర్చుల్లో కొంత వాటా రాజప్రముఖులకూ అందుతుందట. అందుకే గాలింపు చర్యలు జరగడం అంటే అంత మక్కువ. అవి జరగడం రాజ్య రక్షణకు వుపయోగపడుతుందో లేదో గానీ, రాజప్రముఖుడి ధనదాహం, అధికారదాహం తీరుతుంది''

ఆ మాటలు విని–

ఆ! అంటూ కోశాధికారీ, దండనాధికారీ ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టారు.

ఆ రాజ్యపు సరిహద్దుల్లోని, అదే దుర్గమారణ్యం ముందు, అదే నాయకుడు, తన పటాలంతో... అలాంటి నాయకులే చాలాచోట్ల, చాలా కాలాలలో, అలాగే తలపాగాలు తీసి తల దువ్వుకున్నట్లు.. గాలింపులు చేస్తూ.

అదే మానవ వాసనల్ని వగబీలుస్తూ, తమ వద్ద ఎప్పుడూరాని మానవ వాసనల్ని, తాము ఎప్పుడూ హరిస్తున్న మానవ వాసనల్ని పీలుస్తూ.. చూపులతో ఆ దేహాలు చిందిన రక్తం చేసిన త్యాగాలను చీలుస్తూ అనంతంగా...!

★



# నేను ప్రేమలో పడలేదు

**హిం**దీ సీరియళ్లు చూసే ఏ వీక్షకుడైనా శిల్పా సక్లాని గురించి తెలియకపోవడమంటూ వుండదు. హిందీలో హాట్‌బేబీగా పేరుపొందిన శిల్పా.. ప్రేమలో పడిందని అందరూ అనుకుంటూ వుంటే, కాదు కాదు నేను అలాంటిదాన్ని కాదని వాదిస్తోంది. ఇంతకీ ఈ అమ్మాయి పుట్టింది విశాఖపట్నంలోనే అంటే నమ్ముతారా? తండ్రి నేవీ ఆఫీసర్ కావడంతో ఆయన వైజాగ్‌లో పనిచేశాడుట. ఇక ప్రేమ విషయానికొస్తే, అసలు నాకు స్నేహితులున్నారుగానీ, లవర్‌బాయ్స్ లేరు అంటూ చెబుతోంది సక్లాని. మరి పక్కనున్న బాయ్‌ఫ్రెండెవరని చెబితే, సెట్‌లో కలిసినా బాయ్‌ఫ్రెండ్స్‌కింద లెక్కకడితే నేనేమీ చేయలేను అంటోంది. ఇక సంజయ్‌గాధ్వి సినిమాల్లోకి తీసుకున్నాడు ఈ సుందరిని. అయితే వీళ్లిద్దరి మధ్యా రిలేషన్ గురించి అడిగితే, అసలు మగాడితో మాట్లాడితేనే అంటగట్టేస్తారు అంటూ శిల్పాసక్లాని విరుచుకుపడుతోంది!